


# గోడమీద బొమ్మ

## — మోహిని

నాకు ప్రమోషను ఇస్తున్నారని అనఫిషియల్‌గా ఇవాళే తెలిసింది. ఈ సంగతి తెలిసినప్పటి నుంచీ మనసులో ఏదో కలవరంగా వుంది.

జీతం పెరుగుతుంది. హోదా పెరుగుతుంది. ఇంకా ఏవో పెరుగుతాయి. అంతవరకూ సంతోషమే.

కానీ వీటితోపాటు బరువు పెరుగుతుంది. బాధ్యత పెరుగుతుంది. సీటు మారుతుంది. ట్రాన్స్‌ఫరు అయినా కావచ్చు.

ఇప్పటి వరకూ నేను పైవాళ్ళను మాత్రమే "ప్లీజ్" చేస్తూ వచ్చాను. కానీ ఇకనుంచి పైవాళ్ళతోపాటు కిందివాళ్ళను కూడా "ప్లీజ్" చెయ్యాలి. ఆ ఇరుపక్షాల మధ్య ఇరుక్కుపోకుండా ఉపాయంగా పనులు చక్కబెట్టగల నేర్పు నాలో వుందా?

ఈ ఆలోచనతోనే మనసులో అశాంతిగా వుంది. అందువల్ల ఇంత రాత్రి అయినా నిద్రపట్టటం లేదు.

మరో మంచంమీద శారద, చంటిగాడు నిశ్చింతగా నిద్రపోతున్నారు.

మార్పు కోసం నెమ్మదిగా తలుపులు తెరిచి బయటకు వచ్చాను.

బయట చిమ్మ చీకటిగా వుంది. అంత దూరంలో వెలుగుతున్న వీధిలైటు కాంతి మా ఆవరణ చేరుకోలేకపోతూంది.

కళ్లు చీకటికి అలవాటుపడ్డ తరువాత తడుముకుంటూ నడిచి జామచెట్టు క్రింద వున్న కుర్చీలో కూర్చున్నాను.

అదొక పెద్ద బిల్డింగ్. ఆ బిల్డింగ్ చుట్టూ నాలుగైదు ఔట్‌హౌస్ లాంటివి కట్టి అద్దెకిచ్చారు. అందులో మాదొక వాటా. అన్ని వాటాల వాళ్ళూ మెయిన్ బిల్డింగ్‌లో వాళ్ళతోసహా ముందు వైపున వున్న పెద్దగేటులోంచి ఆవరణలోకి రావాలి. అది తప్ప మరో మార్గం లేదు. బిల్డింగ్‌కు వెనకవైపున కూడా కాంపౌండు గోడ వుంది. ఆ గోడ అవతల మరో సందు వుంది. కానీ ఆ సందులోకి వెళ్ళాలంటే మెయిన్ గేటులోంచి చుట్టూతిరిగి వెళ్ళాల్సిందే కానీ మరో ద్వారం లేదు.

ఆలోచనల్లో మునిగి వున్న నాకు క్షణకాలం ఒళ్ళు జలదరించింది. కాళ్ళల్లో వణుకు ప్రవేశించింది. నన్ను భయభ్రాంతుణ్ణి చేసిన ఆ దృశ్యం నిజమా లేక నేను భ్రమపడ్డానా అని సందేహం కలుగుతుంది.

ఎవరో నల్లగా వున్న ఒక వ్యక్తి వెనకవైపు గోడమీదకి ఎక్కి మా ఆవరణలోకి దూకటానికి ప్రయత్నంచేస్తున్నాడు. నన్నే చూసాడో మరో కారణం వల్ల జరిగాడో తెలీదు. కానీ రెప్పపాటు కాలంలో అతను తిరిగి గోడకి అవతలివైపున గల సందులోకి మాయం అయినాడు.

నా ఆలోచనలు చెదరిపోయాయి. రెండునిముషాలకి గుండె దిటవు చెందింది.

ఆ మనిషి ఎవరు?

ఇంత రాత్రివేళ ఆ గోడ ఎక్కి ఆవరణలోకి ప్రవేశించటానికి ప్రయత్నం చేస్తున్నాడంటే అతను దొంగ అయి వుండాలి.

అన్ని పోర్షనుల వాళ్ళూ తలుపులు బిగించుకుని నిద్రపోతున్నారు. జీరో బల్బులు వెలుగుతున్నట్టు కిటికీలోంచి కనబడుతోంది.

ఈ ఇంటిలో మేము అద్దెకు ప్రవేశించి మూడు నెలలే అయింది. ఈ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నట్టు ఇంతకు ముందు ఎవరూ అనలేదు.

కాంపౌండులో వున్న ఇతరులను లేపి జాగ్రత్తగా వుండమని చెప్పటమా లేక మనకెందుకులే అని వూరుకోవాలా అన్న మీమాంసలో పడ్డాను. మిగిలిన వాళ్ళు నాకంటే పాతవాళ్ళే కాబట్టి వాళ్ళ జాగ్రత్తలో వాళ్ళుండగలరు.

దొంగ ఎలాగూ లోపలికి ప్రవేశించలేదు కాబట్టి ఈ సమయంలో ప్రక్క వాళ్ళని లేపి నిద్రాభంగం కావించటం మంచిది కాదనిపించింది.

వెంటనే ఇంటిలోకి వచ్చి, నగలు, డబ్బు అంతా అలమరాలో భద్రపరిచి, తాళం చెవులు దిండు కింద పెట్టుకున్నాను.

రాత్రి అంతా సాధ్యమైనంత మెలకువగా వుండటానికి ప్రయత్నించాను. నిద్రలో ఏ మాత్రం అలికిడి అయినా లేచి, దొంగ ప్రవేశించాడన్న భ్రమతో చుట్టూ చూడటం మొదలు పెట్టాను.

తెల్లవారింది.

గత రాత్రి అంతా కలత నిద్రలో గడిపినందుకు కళ్ళు మండడం మొదలు పెట్టాయి.

రాత్రి నేను చూసిన దృశ్యం శారదకి చెప్పాను.

"ఇంతకు ముందు నేను కూడా ఒకసారి ఎవరో గోడదూకి లోపలికి రావటం చూసాను" అంది శారద.

నేను ఆశ్చర్యపోయాను.

"అది ఎప్పటి సంగతి?"

"మీరు గతవారం ఆఫీసు పనిమీద కాంపు వెళ్లారు. ఆ రోజు రాత్రి మీ గురించి ఆలోచిస్తూ నిద్రపట్టక, బయటకు వస్తే వెనకవైపు నుంచి ఎవరో మన కాంపౌండులోకి దూకినట్టు అనిపించింది.

"మరి ఆ విషయం నాకు చెప్పలేదే!"

"నేను భ్రమపడ్డానేమోననిపించింది. చీకటిలో ఏదీ స్పష్టంగా కనుపించలేదు. ఏదీ నిర్ధారణగా తేల్చుకోలేక మీతో చెప్పలేదు. తరువాత ఆ సంగతి మరిచిపోయాను. ఇవాళ మీరు అంటుంటే ఆ రోజున నేను చూసింది నిజమే అనిపిస్తోంది" అంది శారద భయపడుతూ.

"సరే ఈ విషయం నిర్ధారణగా తేల్చుకుని, ఆ తరువాత మన ప్రక్కవాళ్ళకు చెబుదాం. ఏది ఏమైనా ఎవరి జాగ్రత్తలో వారుండటం మంచిది" అన్నాను నాలో లేని ధైర్యం శారదకి చెబుతూ.

"నిర్ధారణ చేసుకోవటం ఎలా?"

"గత రాత్రి ఆ దొంగ లోనికి ప్రవేశించలేక పోయాడుగదా. అతను నిజంగా దొంగ అయితే అంతటితో వూరుకోడు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తాడు. కాబట్టి మనం వరసగా కాపలా కాసి అసలు సంగతి తేల్చుకోవాలి" అన్నాను.

"సరే" అంది శారద.

ఆ రోజు రాత్రి పెందరాడే భోజనాలు ముగించి, నేను శారద మా ఇంటి కిటికీకి దగ్గరగా కుర్చీలు వేసుకుని, గదిలో కూర్చున్నాము. గదిలో లైటు తీసివేసాను. కిటికీ తెర దించి, కొంచెం కాళీ వుంచాను. అందులోంచి బిల్డింగ్ వెనకభాగం కనపడుతోంది.

కళ్ళు తెరిచి అలా రాత్రి పన్నెండు దాటేవరకూ కూర్చున్నాము. కానీ ఆ దొంగ ఆచూకీ లేదు. నిద్ర వస్తోందని శారద వెళ్ళి పడుకుంది. నేను మరో గంటసేపు చూసి నిద్రలోకి జారుకున్నాను.

అయినా మా ప్రయత్నం విడవకుండా వరసగా నాలుగు రోజులు అలాగే కావలా కాసాము.

నాలుగవ నాటి రాత్రి దాదాపు పన్నెండు గంటలకి ఓ వ్యక్తి గోడ ఎక్కి కూర్చుని మా ఆవరణలోపలి పరిస్థితులనూ అంచనా వేస్తున్నాడు. ఆ వ్యక్తిని ముందు నేనే చూసి శారదకి చూపించాను.

ఆమె భయంతో వణికిపోసాగింది.

"తలుపులు, కిటికీలు వేసి పడుకుందాం. మనకెందుకు వచ్చిన బెడద" అంటూ తొందర చేయసాగింది.

"తలుపులు మూసుకుంటే పోయేదికాదు. ఇవాళ కాకపోతే రేపు అయినా ఆ దొంగ మన ఇంటిలోనే ప్రవేశించవచ్చు. కాబట్టి అంతా కలిసి ఆ దొంగని పట్టే పథకం వెయ్యాలి" అంటూ ఆమెకు కర్తవ్యం బోధించాను.

"ఇప్పుడు ఏం చేద్దామంటారు."

"ఏం చెయ్యాలన్నది ఆ తరువాత ఆలోచిద్దాము ముందు ఆ గోడమీద వ్యక్తిని గమనించు."

ఇంతలో అతను ఇటువైపు మా ఆవరణలోకి దూకి గబగబా నడుచుకుంటూ వెళ్ళి చివరి వాటాలో దూరాడు.

అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయం ఏమంటె అతని రాకకోసమే అన్నట్టు ఆ ఇంటి తలుపు ఓరగా తెరచి వుంది. ఆ వ్యక్తిలోనికి ప్రవేశించగానే తలుపు మూసుకుంది.

అతను దొంగ అయితే తిరిగి పారిపోవటానికి వీలుగా తలుపు తెరిచి వుంచుతాడు కానీ లోపలి వైపున ఎందుకు గడియపెడతాడు.

నాకేమీ అర్థం కాలేదు.

"నేను వెళ్ళి చూసి వస్తాను" అంటూ బయలు దేరాను.

"వద్దు. అతని చేతిలో ఎలాంటి ఆయుధం వుందో. లేనిపోని చిక్కుల్లో ఇరుక్కోవద్దు. అంతగా అయితే ఎవరినైనా తోడు తీసుకుని వెళ్ళి పోలీసులకి టెలిఫోను చెయ్యండి" అంటూ శారద కంగారుపడసాగింది.

"వూరికే భయపడుకు" అంటూ ఆమెను విదిలించి బయటకు వచ్చి, దొంగ ప్రవేశించిన వాటా వైపుకి నడవసాగాను.

ఆ వాటాలో చలపతి వుంటున్నాడు. అతను ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పనిచేస్తాడు. అతనితో నాకు కొంచెం స్నేహం వుంది.

చలపతి ఆఫీసు పనిమీద క్యాంపు వెళ్ళి రెండు రోజులు అయింది. అది తెలుసుకుని దొంగ ప్రవేశించినట్టున్నాడు.

చలపతి భార్య వసంత మెడలో నగలు కూడా వున్నాయి. ఏ అఘాయిత్యం జరుగుతోందో అనుకుంటూ గబగబా ఆ పోర్షను చేరుకున్నాను.

ఇంతలో ఆ ఇంటిలోంచి నెమ్మదిగా మాటలు వినపడసాగాయి. ఒక మగ గొంతు మరో ఆడ గొంతు నెమ్మదిగా గుసగుసలు చెప్పుకుంటున్నారు. చలపతి ఊళ్ళో లేడు. మరి ఈ మగ గొంతు ఎవరిది?

దొంగదే అయి వుండాలి.

దొంగతనానికి వచ్చినవాడు ఇంటిమనిషితో కబుర్లు ఎందుకు పెట్టుకుంటాడు.

నాకు అనుమానం మొదలు అయింది.

మరింత శ్రద్ధగా గోడకి చెవిపెట్టి వినసాగాను.

మాటలు స్పష్టంగా వినపడటం లేదు. కానీ చలపతి భార్య వసంత గొంతు క్లియరుగా తెలుస్తోంది. అతని గొంతు గుర్తించలేకపోయాను.

దొంగతనం జరుగుతున్న చప్పుళ్ళు కానీ, ఆమె భయంతో పెనుగులాడుతున్నట్టుగానీ వినపడటం లేదు.

దాంతో నాకూ మరి కొంతవరకు అర్థం అయింది. ఆ వచ్చిన వ్యక్తి డబ్బు కానీ, వస్తువులు కానీ దొంగతనం చేయటానికి రాలేదు, అతను వసంత కోసం వచ్చినట్లు తేలిపోయింది.

అతను వచ్చేసరికి తలుపు తెరిచి వుంది కాబట్టి ఇదేదో "పాత పురాణం"లానే కనపడింది.

వచ్చినవాడు దొంగ కాదని తేలిం తరువాత ప్రాణం కుదుట పడింది.

ఈ అర్ధరాత్రి సమయంలో అతను ఎవరైందీ తెలుసుకోవటం అనవసరం అనిపించింది.

తిరిగి మా ఇంటిలోకి ప్రవేశించి, నేను విన్నది శారదకి చెప్పాను.

ఆమె నమ్మలేదు.

"వసంత మనసు నాకు బాగా తెలుసు. ఆమె ఇలాంటి వెధవ పని చెయ్యదు. మీరేదో పొరపాటు పడ్డారు" అంది శారద.

"నేనేం పొరపాటు పడలేదు. వసంత విషయంలో నువ్వే భ్రమలో వున్నావు."

"ఏమో నాకు ఇంకా సందేహంగానే వుంది."

"అయితే నాతోరా. వాళ్ళిద్దరూ చెప్పుకునే గుసగుసలు విన్న తరువాత నీకే అర్థం అవుతుంది."

"నేనేం రాను. నాకసలే భయంగా వుంది. ఎవరి పాపాన వాళ్ళు పోతారు. మనకెందుకు" అంది శారద.

మరునాడు ఉదయం చలపతి కనిపించాడు. తెల్లవారు ఝామున ఏ బస్సులోనో క్యాంపు నుంచి

వచ్చి వుంటాడు. అతన్ని చూసిం తరువాత జరిగిన సంఘటన చెప్పాలనిపించింది.

ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

మరి అంత సున్నితమైన విషయం చెప్పటం తేలికవని కాదు. అయినా అసలు చెప్పటం ఎందుకు ఏనాటికైనా అతనే తెలుసుకుంటాడు.

భార్యాభర్తల మధ్యగల "చాటు వ్యవహారాలు" ఎప్పటికైనా బయటకు వస్తాయి. అలాంటప్పుడు నేను కల్పించుకోవటం ఎందుకు?

అంతే కాక, తెల్లవారింతరువాత వసంత ముఖంలోకి చూస్తే, ఆమె అగ్ని ప్రవేశం చేసిన సీతలా అగుపించింది.

ఆఫీసులో కూర్చున్నా, కళ్ళముందు ఇంకా రాత్రి సంఘటనే మెదలసాగింది.

జరిగింది మనసులో దాచుకోలేక నా సన్నిహిత మిత్రుడు కాంతారావుకి కథ మొత్తం వివిపించాను.

"అయితే నువ్వు ఏంచెయ్యదలుచుకున్నావు ఈ విషయంలో" అన్నాడు కాంతారావు.

"ఏం చేయాలి. చేసేది ఏమీలేదు. ఒక వేళ ఇది పాడువని అనుకుంటే దాని పర్యవసానం వాళ్ళే అనుభవిస్తారు" అన్నాను తేలికగా కొట్టేస్తూ.

కాంతారావు నువ్వొక అమాయకుడవు అన్నట్టు చూసి "అక్కడే నువ్వు పొరపాటు పడుతున్నావు ఎవరి పాపం వాళ్ళది. అనుకున్నంత వరకే అయితే బాధ లేదు కానీ దీనివల్ల మిగిలిన వారికి కూడా ప్రమాదం వుంది. అన్నాడు.

'ఎలా!' అన్నాను. అయోమయంగా.

"సింపుల్! ఆ దొంగగారికి నాలుగు రోజులు గడిచే సరికి వసంత మీద మోజు తీరిపోతుంది. అప్పుడు అంతటితో పోనీక ప్రక్క ఇంటి ఆడ వాళ్ళ కోసం ప్రయత్నించ వచ్చు. కాబట్టి తక్షణం మేలుకోండి." అంటూ ఉపదేశం చేసాడు.

కాంతారావు మాటలువిన్న తరువాత నా జేబులో టైంబాంబు వున్నంత కంగారు పడసాగాను.

"అయితే ఏం చేయాలో కూడా చెప్పు"

"విను. సిన్సియరుగా చెప్పాలంటే మనం ఆ దొంగని అసహ్యించుకోకూడదు."

"కారణం?"

"అతను వెధవపని చేసాడనుకుంటే, ఛాన్సు దొరకాలే గానీ. అలాంటి వెధవపని చెయ్యటానికి నువ్వూ, నేనూ ప్రతివారూ రెడీయే"

"అర్థం అవుతోంది"

"అందువల్ల అతన్ని కలుసుకుని ఈ దుకాణం మరో చోట పెట్టుకోమని అడుగు"

"ఓకే"

"లాస్ట్ పాయింట్ ఒకటి వుంది"

"చెప్పు"

"ఆ దొంగ గారికి వసంతకి మధ్య గల రహస్య సంబంధం పదిమందికి తెలిసేలా గొడవ చెయ్యకు. అలా చేయటం వల్ల అసలు విషయం మిగిలిన ఆడవాళ్ళకు తెలిసి, వాళ్ళకు లేని ఆలోచనలు పుట్టించ వచ్చు."

గత రాత్రి వచ్చిన ఆ దొంగ ఈ రాత్రి కూడా వస్తాడని పించింది. చలపతి క్యాంపు నుంచి వచ్చిన సంగతి అతనికింకా తెలియక పోవచ్చు.

కాంతారావు చెప్పిన సలహాప్రకారం రాత్రి దొంగని కలుసుకోవాలని ఎదురు చూడటం మొదలు పెట్టాను.

గత రాత్రి లాగానే, ఆ అగంతకుడు మళ్ళీ గోడ మీద అదే టైముకి ప్రత్యక్షమయ్యాడు. క్షణకాలం తరువాత అతను ఇవతలివైపుకి దూకాడు.

అతను ఆ చివరి ఇంటిలో ప్రవేశించకముందే– నేను గబగబా పరుగెత్తుకు వెళ్ళి అతన్ని చేరుకున్నాను.

నన్ను చూసి అతను కంగారుపడ్డాడు. పారిపోయే ప్రయత్నం చేయబోతే, అతని చెయ్యి గట్టిగా పట్టుకున్నాను.

"నేను సారథీ! చెయ్యి వదులు" అన్నాడు అతను.

అంతే!

నేను నిలువునా కొయ్యబారిపోయాను.

ఆ గొంతు నాకు చిర పరిచయమైంది.

అతను ఎవరోకాదు. చలపతే!

నేను చలపతి చెయ్యి వదిలేసాను.

అతను ఏమీ జరగనట్టుగా నెమ్మదిగా నడుచుకుంటూ తన ఇంటిలోకి వెళ్ళిపోయాడు.

నేను ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

నేను మామూలు మనిషి కావటానికి అరగంట పట్టింది.

అసలు చలపతి తన ఇంట్లోనే దొంగతనంగా ప్రవేశించటం ఏమిటి? ఎక్కడి నుంచి అయినా వస్తూ వుంటే మెయిన్ గేటులోంచి రావచ్చుగదా. అది ఎప్పుడూ తీసే వుంటుంది. అలాంటిది వెనక సందులోంచి, కాంపౌండు గోడ ఎక్కి ఇటువైపుకి దూకటం ఏమిటి?

మరునాడు చలపతిని అసలు విషయం ఏమిటని అడిగాను.

"చిన్నప్పటి నుంచీ నాకో బలహీనత వుంది" అన్నాడు.

నేను శ్రద్ధగా వినసాగాను.

"నాకు కావలసిన వస్తువు ఎంత అందుబాటులో వున్నా, దొంగతనంగా పొందటంలోనే నాకు ఎక్కువ ఆనందం కలుగుతుంది."

"కాస్త విపులంగా చెప్పు" అన్నాను.

"చిన్నప్పటి నుంచీ నాలో ఒక రకమైన కాంప్లెక్సు డెవలప్ అయింది. నేను కోరుకునేది దొంగతనం చేసి పొందితే కానీ నాకు ఆనందం కలిగేదికాదు. మా అమ్మ చిన్నప్పుడు తినడానికి ఏమైనా చేసి ఇన్ని పెడితే, వాటిని మా అమ్మ చూడకుండా తిరిగి డబ్బాలోనే వేసి, మళ్ళీ మా అమ్మ చూడకుండా అవకాశం చూసుకుని దొంగతనంగా తెచ్చుకునేవాడిని."

"అంటే మీ అమ్మ పెట్టినవాటికంటె ఎక్కువ కావాలనిపించినప్పుడా"

"ఆదేం కాదు. ఎక్కువ కావాలని కాదు. మళ్ళీ దొంగతనం చేసినప్పుడు, అంతకుముందు మా అమ్మ పెట్టినవే తెచ్చుకునేవాడిని. అలా దొంగతనంగా తెచ్చుకుంటే కానీ నాకూ తృప్తిగా వుండేదికాదు.

"క్రమంగా నా వయసుతోపాటు ఆ అలవాటు కూడా పెరుగుతూ వచ్చింది. పరిస్థితి ఎంతదూరం వచ్చిందంటే, నేను యూనివర్సిటీలో యం. ఎ చదివేటప్పుడు లైబ్రరీలో పుస్తకాలు కూడా దొంగిలించి తెచ్చేవాడిని. రిజిష్టరులో కేవలం సంతకం చేసి తెచ్చుకోగలిగిన పుస్తకాలు కూడా సంతకం పెట్టకుండా, దొంగతనంగా తెచ్చేవాడిని.

"అదే అలవాటు వల్ల పెళ్ళయ్యాక రాత్రి సమయంలో నా ఇంటిలోకి నేనే దొంగతనంగా ప్రవేశిస్తున్నాను." అన్నాడు చలపతి.

ఇలాంటి వారు వుంటారని ఎవరన్నా చెబితే నమ్మేవాడిని కాదేమో కానీ ఇప్పుడు చలపతిని చూస్తూ నమ్మకుండా వుండలేకపోయాను. □